# పార్వతీ పరిణయం

ఆకాశం నిండా మబ్బులు క్రమ్మాయి. ఎక్కడా ఆకన్నా కదలడం లేదు. దీనికి తోడు మనసంతా చిరాగ్గా ఉంది. చలపతిరావు నిరాలోచనగా జుట్టులోనికి వేళ్ళుపోనిచ్చి సర్దుకున్నాడు.

ఇటువంటి సంఘటనను ఎదుర్కోవలసి వస్తుందని చలపతి ఏ నాడో ఊహించాడు. అయితే అదింత త్వరగా వస్తుందని గాని, వచ్చినా ఇంత ప్రబలంగా సాక్షాత్కరిస్తుందని గాని అతననుకో లేదు. నిజంగా ఇది చలపతిరావు తప్పే.

కావటానికి అతనింతవరకు ఎవర్నీ ప్రేమించ లేదు. కనీసం ఆ ధోరణిలో కూడా లేదు. అయితే పెళ్ళిని గురించి అతనికి కొన్ని దృఢమయిన అభిప్రాయాలు ఏర్పడి వున్నాయి. ఆ అభిప్రాయాలను మార్చుకోవడ మంటే అతనికి సుతరామూ యిష్టంలేదు కూడాను.

ఎవరో అన్నట్టు పెళ్ళి పదిజీవితాల సంధి. ముందుగానే అన్ని విషయాలు ఆచి, తూచి మరీ నిర్ణయించుకోవాలి. ఒక సారి జరిగిపోయిందంటే దాన్ని మళ్ళీదిద్దుకొనేందుకు అవకాశం లేదు. ఇష్టం ఉండటం ఉండకపోవడం అన్న ప్రసక్తే లేదు. అలా రోజులు నెట్టుకొంటూ వెళ్ళవలసిందే.

పెళ్ళివిషయంలో చలపతిరావుకు పెద్ద ఆశలు కూడా లేవు. ముందుగా పిల్ల తనకు నచ్చాలి. ఆ తరువాత తనూ ఆవిడకు నచ్చాలి. ఇవి రెండూ జరిగాక ఇతర కారణాలు

అంటే — కట్నాలు, లాంఛనాలు వగయిరాలు పెళ్ళి విచ్ఛిత్తి కారణాలు కారాదు. ఇవన్నీ స్వల్పమైనవని చలపతిరావు వుద్దేశ్యం. తన అభిప్రాయాలకు భిన్నమైన అభిప్రాయాలు సజావైనవి కావనుకోవడం మానవ సహజమను కొన్నప్పుడు మనం చలపతిరావును తప్పుపట్ట నవసరంలేదు. వివాహ జీవితం సమగ్రంగా ఉండటానికి తను అనుకొన్న విధంగా వుండాలని అతని వాదన.

విచిత్రమేమంటే చాలా పెళ్ళిళ్ళు మనం అనుకొన్న విధంగా జరగవు. జరగలేదు కూడాను. కాని ఆ దంపతులు సుఖంగానే ఉంటున్నారు. కనీసము ఉన్నట్లయినా కనుపిస్తున్నారు. ఇలా వుండటానికి చలపతి అనుకున్న వన్నీ వాటిలో వుండటం కారణం కానేకాదు. ఇంతకు మిరిచిన దేదో వుండి వుండాలి.

చలపతిరావుకు తన తండ్రిమీద వల్లమాలిన కోపం వచ్చింది. తనను సంప్రదించకుండా పిల్లను వెళ్ళి చూసి రావడమే కాకుండా దాదాపు ఖాయం కూడా చేసుకొచ్చాట్ట. ఎటుకూడీ లగ్నాలు మాత్రం పెట్టుకోలేదు. ఎప్పుడు పెట్టుకున్నా తమ కభ్యంతరం లేదని పిల్లవాళ్ళన్నారట. కట్నకానుకల్లోకూడా ఇంకోరిచేత 'ఇదేమి' అని వేలెత్తి చూపించుకోకుండా ఇస్తామన్నారట. అన్నిటికన్నా ముఖ్యమయిన దేమిటంటే బోలెడంత ఆస్తికి ఆ పిల్ల వొక్కతే వారసురాలు.

ఈ చివరి వాక్యం చలపతికి చాలా అసహ్యంగా కనిపించింది. బహుశా తన తండ్రికి అదే గొప్పగా కనుపించినా కనిపించి వుండవచ్చు ననుకొన్నాడు చలపతి. ఆ పిల్ల వెనుక అంత ఆస్తి లేకపోతేనూ, వాళ్ళు వేలెత్తి చూపించుకోని

విధంగా కట్నాలు యివ్వకపోతేనూ ఆ సంబంధం తండ్రికి యేమాత్రము నచ్చి వుండదనుకున్నాడు చలపతి. తన యిష్టం లేకుండానే తనచేత బలవంతంగా ఎవరో హత్యను చేయిస్తున్నట్లు గిజగిజ లాడిపోయాడు చలపతి. ఆ మర్నాడే తండ్రికి పెద్ద వుత్తరం రాసి పడేశాడు.

*    *    *

ఇది జరిగి యిప్పటికి రమారమి నాలుగైదు మాసాలు కావస్తోంది. తండ్రి ముచ్చటగా మూడే బంతులు రాశాడు.

'నీ మనసు కష్టపెట్టడం నా కిష్టం లేదు. ఆ సంబంధం వదులుకున్నామని పిల్లవాళ్ళకు రాశాను. దురదృష్ట వంతుల్ని బాగుచేసేవాళ్ళు లేరు.'

తండ్రినుంచి యింత తాపీయైన జవాబు వస్తుందనుకో లేదు చలపతి. ఆయన ధాం ధూం అంటాడనీ, దానిమీద అంతకన్నా తను మండిపోవటం ఖాయమనీ, అప్పుడు తనీ విధంగా వుత్తరం రాయవలసి వుంటుందనీ ఒకటికి పదిసార్లు రిహార్సల్సు వేసుకున్నాడు చలపతి. ఇదేమి జరక్కపోడం అతనికి కొంత నిరుత్సాహాన్ని కలిగించింది. తండ్రిమీద జాలి కూడ వేసింది. ఈ వుత్తరం రాయడానికి ముందు తండ్రి యెంతగా మధనపడి ఉంటాడో ననుకున్నాడు. తనకోసం బోలెడన్ని బాధలు పడుతున్న మనిషి — కేవలం తన పెళ్ళి విషయంలో తన కేదో అన్యాయం చేస్తాడనుకోవడమే తప్పని చలపతి భావించాడు. పోనీ ఈ తప్పును దిద్దుకుందామన్నా వీల్లేదు. సంబంధము వదలుకొన్నట్లు తండ్రి రాయనే రాశాడు.

ఇదీ ఒకందుకు మంచికే వచ్చిందన్న సంగతి కొద్ది రోజుల్లోనే తేలిపోయింది.

ఒకసారి చలపతి, సీతారామారావుగారింటికి వెదుక్కొంటూ వెళ్ళాడు. ఆయనగారికి నాటకాల్లో కట్టుకుపోయినంత అనుభవముంది. చలపతి ఆంధ్రవారోత్సవాలకు మంచి నాటక మేదన్నా ఆడాలనుకొన్నాడు. ఈ సందర్భంలో కొంత సాయం పొందటానికిగాను రామారావుగారింటి కెళ్ళాడు. ఉన్న సంగతంతా చెప్పాడు.

'నాయనా నాచేతనైనంతా చేస్తాను. నీ పని ఒడ్డెక్కించే పూచీ నాది. అయితే నా మెడన మరో బండకూచుంది. దాన్ని నువ్వు దించాలి' అన్నాడాయన.

'చెప్పండి' అన్నాడు చలపతి.

'ట్యూషను చెప్పే అలవాటు నీకుంటే— రెణ్నెల్ల పాటు మా అమ్మాడుకు చెప్పాల్సి ఉంటుంది. నాకై నేను చెబుదును గానీ – పాతికేళ్ళనాటి ముచ్చటాయె – ఒక్కటీ బుర్రలో లేదు. ఈ పని కాస్త నువ్వు చేస్తివా – నా నెత్తిన పాలు పోసినట్టనుకో' అన్నాడు సీతారామారావుగారు.

'అలాగేనండి' అన్నాడు చలపతి.

సీతారామారావుగారు నాటకాల పని చూస్తున్నాడో లేదోగానీ, చలపతి మాత్రం రెగ్యులర్‌గా పాఠం చెప్పడానికి హాజరవుతున్నాడు. అతనికి చదువు చెప్పడం మీదకన్నా, పార్వతితో కబుర్లాడటమంటే వల్లమాలిన ఆపేక్ష పుట్టుకొస్తున్నది.

'ఏనాటికన్నా నేను పెళ్ళాడటమంటూ జరిగితే, పార్వతిలాంటి దాన్నే చేసుకోవాలి' అనుకొన్నాడు చలపతి అనేక సార్లు.

పార్వతి తనకు అన్నివిధాలా నచ్చింది. ఈ పెళ్లే జరిగితే తన జీవితం చాలా హాయిగా ఉంటుందనుకొన్నాడు. ఈ విషయాన్నే సీతారామరావుతో కూడా సూచనగా అని చూచాడు.

'నాన్నా దానికీ నీకూ ఇష్టమయితే నా కేమీ అభ్యంతరంలేదు. మా బావ పరమ చాదస్తపు మనిషి. అయినా నేను ఒప్పిస్తాను. మరి మీ నాన్నా వాళ్ళ సంగతేమిటి? తీరా మూడు ముళ్లూ పడిన తరువాత రసాభాస కాకుండా చూచుకోవల్సింది నువ్వే. నా మేనగోడలని కాదు కానీ అది రవ్వ చెక్కలాంటి పిల్లనుకో నాయనా. నాకే పదేళ్ళు తక్కువ వయస్సుండి, పెళ్ళంటూ కాకపోతే, పార్వతిని అమాంతం కట్టుకొని ఉందును' అన్నాడాయన అపరిమితంగా నవ్వుతూ. ఆలస్యమయితే పార్వతి తనకు దక్కదేమో ననిపించింది. తన కిష్టంలేని పెళ్ళిని రద్దు చెయ్యడానికి వొప్పుకొన్న తండ్రి ఇష్టమైన ఈ పెళ్ళికి తప్పకుండా అంగీకరిస్తా డనుకొన్నాడు. ఆ ఉద్దేశంతోనే, సీతారామారావు గారికి మాట కూడా ఇచ్చేశాడు.

ఏమయితేనేం గానీ పెళ్ళినాటికి చలపతి తల్లిదండ్రులు రానేలేదు. ఆ బాధ ఏమాత్రమో చలపతి మనస్సులో ఉంది.

ఆ రాత్రి డాబామీద పచార్లు చేస్తున్నాడు చలపతి. ముసిరిన మబ్బులన్నీ చెల్లా చెదరయ్యాయి. చందమామ కడిగిన వెండికంచంలాగా మెరుస్తున్నాడు. కాస్సేపటికల్లా, తమలపాకులకు ఈనెలు తీసుకొంటూ పార్వతి కూడా పైకి వచ్చింది.

'ఇవ్వాళా?' అన్నాడు చలపతి.

'ఇంకా నిద్రపోలేదా?' అన్నది పార్వతి.

పార్వతి ఏవో కబుర్లలోకి దించింది. మాటల సందట్లో, తన కిదివరకో సంబంధం తండ్రి మాట్లాడినట్లూ, తనే కాదన్నట్లూ చెప్పాడు చలపతి.

'నీలాంటి దాన్ని చేసుకోవలసి ఉండగా ఆ సంబంధం తప్పిపోక ఏం చేస్తుంది?' అన్నాడు చలపతి.

పార్వతి కళ్ళల్లో ఏదో మెరిసినట్లనిపించింది.

'ఆ తప్పిపోయిన పిల్ల గూడా నాలాంటిదే ననుకోండి. పోనీ నేనే ననుకోండి, అప్పుడే మంటారు?' అన్నది పార్వతి.

చలపతి నివ్వెర పోయాడు.